## క్లుప్తంగా

### ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

**పొదలకూరు :** పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మల్లింకొండయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### వేతన బకాయిల చెల్లింపు

**బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చి నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను మంగళవారం చెల్లించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ తమకు 13 నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడ్డామని, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవ తీసుకుని చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడి తమకు వేతన బకాయిలను అందించారని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

### క్రీడాకారుడికి అభినందన



**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** రాష్ట్ర స్థాయిలో పతకాన్ని సాధించిన బాక్సింగ్ క్రీడాకారుడు ధనుష్‌ను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్ అభినందించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యతిరాజ్ మాట్లాడారు. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి యూత్ బాక్సింగ్ పోటీల్లో నెల్లూరుకు చెందిన ధనుష్ 71 – 75 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు. బాక్సింగ్ కోచ్ విశ్వనాథ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్‌హెచ్‌పీలకు శిక్షణ




మాట్లాడుతున్న అధికారులు

**నెల్లూరు (మినీబైపాస్):** నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎమ్మెల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. ప్రాథమిక చికిత్స, పాముకాటు, గాయాలకు కుట్లను ఏ విధంగా వేస్తారు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. అనంతరం డాక్టర్లు నీలిమ, రమాదేవి మాట్లాడారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో సిబ్బందికి నైపుణ్యం పెరిగి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలు కలుగుతుందన్నారు. డాక్టర్ మురళీకృష్ణ, ఏసీఎస్సార్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ హరిశ్చంద్ర సతీష్, బ్రహ్మేశ్వరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### 28న మాదిగల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న సుబ్బయ్య

**నెల్లూరు (వీఆర్సీసెంటర్):** జిల్లాలో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై మాదిగల ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కొత్తూరులో దళితులకు సంబంధించిన భూములను వారికే ఇవ్వాలని కోరారు. సమావేశానికి భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు, నేతలు శ్రీనివాసులు, సుబ్బారావు, సునీత, రఘు, చిన్నయ్య, వెంకట్రావ్, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకు వెళ్లడం ఒక చరిత్ర

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



వృద్ధురాలికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**బుచ్చిరెడ్డిపాళెం :** 'గడప, గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలంతా ప్రతి ఇంటికి వెళ్లడం ఒక చరిత్ర అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 6, 7 వార్డుల్లో 'గడప, గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా గెలిచిన వారు కేవలం గ్రామస్థాయిలోనే సమావేశాలు పెట్టి ప్రజలతో మాట్లాడేవారని తెలిపారు. అయితే ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలను పలకరించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. దీని ద్వారా ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు అవగాహన రావడంతో పాటు, ప్రభుత్వంపై మరింత నమ్మకం కలుగుతుందని తెలిపారు. అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని తెలియజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 63 సచివాలయాల పరిధిలో సుమారు 72,183 ఇళ్లను సందర్శించినట్లు వెల్లడించారు.

**రూ.6.74 లక్షలు అందజేత**

మండలంలోని పెనుబల్లి, సాల్మన్‌పురం గ్రామాలకు చెందిన నాలుగు పొదుపు సంఘాల్లోని 40 మంది సభ్యులకు జగనన్న ఆసరా పథకం కింద రూ.6.74 లక్షల నగదును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే పొదుపు వీఓఏలు, సీసీలుగా విధులు నిర్వహిస్తున్న దాదాపు 45 మందికి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ట్రస్టు ద్వారా చీరలను అందజేశారు. దీంతో పాటు మండలంలోని పెనుబల్లి, వవ్వేరు, పంచేడు, నాగమాంబపురం గ్రామాల్లో నూతనంగా నియమితులైన పది మంది వలంటీర్లకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు రహమత్, షకీలా, నస్రీన్, శివకుమార్‌రెడ్డి, చీర్ల ప్రసాద్, మల్లారెడ్డి, సత్యనారాయణ, యానాదిరెడ్డి, లక్ష్మీకాంతమ్మ, శ్రీదేవి, అనంతమ్మ, ప్రమీలమ్మ, ఎంపీపీ శ్రీనివాసులు, నేతలు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, అల్లాభక్షు పాల్గొన్నారు.

## ఏడుగురు అధ్యాపకుల నియామకం

**మనుబోలు :** మనుబోలు బాలికల జెడ్పీ హైస్కూల్ ప్లస్‌కు కొత్తగా ఏడుగురు అధ్యాపకులను ప్రభుత్వం నియమించింది. వీరు హెచ్‌ఎం వసంతకుమారి సమక్షంలో మంగళవారం విధుల్లో చేరారు. మ్యాథ్స్‌కు మృధుల, ఇంగ్లిష్‌కు వెంకటరమేష్, ఫిజిక్స్‌కు నాగలక్ష్మి, తెలుగుకు ఉషారాణి, ఎకనామిక్స్‌కు విజయమ్మ, కామర్స్‌కు రమేష్‌బాబు, కెమిస్ట్రికి రమేష్ అధ్యాపకులుగా జాయిన్ అయ్యారు. ఈ ఏడాది ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రమే ఉంటాయని వసంతకుమారి తెలిపారు.



కొత్తగా చేరిన అధ్యాపకులతో వసంతకుమారి

## హైస్కూల్ ప్లస్‌లో చేర్చాలని ప్రచారం

**కొడవలూరు :** మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూలు ప్లస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులను చేర్చాలని నూతనంగా ఎంపికైన అధ్యాపకులు మంగళవారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇక్కడి హైస్కూల్లో పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైస్కూలు ప్లస్‌లో చేర్చాలని కోరారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రఫీ అహ్మద్, అధ్యాపకులు చంద్రమౌళి, మంజుల, నాగమల్లికార్జున, భారతి, అన్నపూర్ణ, నరేంద్ర, వసంత ఉన్నారు.



నార్తురాజుపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

## కృష్ణపట్నంలో చలివేంద్రం ప్రారంభం

**ముత్తుకూరు :** కృష్ణపట్నం గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి ప్రారంభించారు. కృష్ణపట్నం గ్రామ సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సమితి అధ్యక్షుడు భవాని శంకర్‌రెడ్డి, సభ్యులు హరిబాబు, నాగార్జున, రాజావివేక్, సునీల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై శివకృష్ణారెడ్డి

## ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయం

**ముత్తుకూరు :** ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా వ్యర్థాలు తొలగిస్తున్నట్లు పంటపాళెం బైపాస్‌రోడ్డులోని పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు అన్నారు. కృష్ణపట్నం ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు బైపాస్‌రోడ్డులోని పామాయిల్ ఫ్యాక్టరీల పరిసరాలు, ఊటల సంఘం కాలనీల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పామాయిల్ ఫ్యాక్టరీల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో కార్యక్రమం చేపట్టినట్లు స్థానిక సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం తదితరులు అన్నారు. కార్యక్రమంలో ఎనిమిది ఫ్యాక్టరీల మేనేజర్లు, ప్రతినిధులైన నారాయణమూర్తి, వరప్రసాద్, విశాల్‌జైన్, గణేష్, చంద్రమౌళి, యోగానంద, మురుగన్, మన్నా సిబ్బంది పాల్గొన్నారు.



బైపాస్‌రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న ప్రతినిధులు

## రూ.110 కోట్లతో నగర పంచాయతీ అభివృద్ధి

- అమృత్ పథకం కింద రూ.85 కోట్ల మంజూరు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చి నగర పంచాయతీ అభివృద్ధికి మరో రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పంపామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నాలుగో వార్డులో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 20 వార్డుల్లో ఉన్న ప్రజలకు తాగునీటిని అందించేందుకు అమృత్ పథకం కింద రూ.85 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 50 శాతం నిధులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి 50 శాతం నిధులు ఉన్నాయన్నారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకున్నామని, త్వరలోనే అగ్రిమెంట్లను పూర్తి చేసుకుని పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ పనుల ప్రారంభానికి మంత్రి రోజాను ఆహ్వానిస్తామని తెలిపారు. అలాగే సైడ్‌కాలువల నిర్మాణానికి మరో రూ.80 కోట్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీతో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

**కామన్ గుడ్ ఫండ్ కింద రూ.9 లక్షలు**

బుచ్చిరెడ్డిపాళెంలో ఉన్న వవ్వేరు రూరల్ కో–ఆపరేటివ్ బ్యాంకు కామన్ గుడ్ ఫండ్ కింద రూ.9 లక్షలను బ్యాంకు చైర్‌పర్సన్ యర్రంరెడ్డి స్వర్ణ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. వీటిలో సాల్మన్‌పురంలో శ్మశాన స్థల ఏర్పాటుకు రూ.4 లక్షలు, చెల్లాయపాళెంలో అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు రూ.2 లక్షలు, వవ్వేరులో చెన్నకేశవస్వామి దేవస్థాన మరమ్మతులకు రూ.3 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిధుల నుంచి రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్డును ప్రారంభించగా, సచివాలయ నిధుల నుంచి రూ.10 లక్షలతో మరో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీపీ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్లు లలితా, షాహుల్, నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి, మోర్ల మురళీ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

### బెంచ్, కుర్చీల వితరణ



**మనుబోలు :** మనుబోలు మండల కేంద్రంలోని సీఎం నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి సేవానాథం ట్రస్టు వారు మంగళవారం ఆఫీస్ బెంచ్, కుర్చీలు వితరణ చేశారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయిని సుగుణమ్మ పాఠశాలలో కుర్చీలు, ఆఫీస్ బెంచ్‌లు అవసరమని ట్రస్టు ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ట్రస్టు సభ్యులు ఒక బెంచ్, నాలుగు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, ట్రస్టు సభ్యులు ఉన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేస్తున్న ఎంపీడీఓ నాగేంద్రబాబు

**ఇందుకూరుపేట :** మండలంలోని నిడిముసలి గ్రామంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్వరి అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు మంగళవారం విచారణ చేపట్టారు. పనికి రానివారి పేర్లతో అక్రమాలకు పాల్పడిందని గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నిడిముసలి గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని, పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు చేపడుతామని ఎంపీడీఓ వివరించారు.

### మనుబోలు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

**మనుబోలు :** మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అనంతరం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, వివిధ కేసుల పురోగతి విషయమై మనుబోలు ఎస్సై ముత్యాలరావుతో సమీక్షించారు.

## వైభవంగా మొలక పోలేరమ్మ జాతర



ఆలయం వద్ద భక్తుల కోలాహలం



విశేషాలంకరణలో అమ్మవారు

**ఇందుకూరుపేట :** మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలకపోలేరమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు పొంగుళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వేడుకగా సాగింది. గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయ, కర్పూర హారతలు పట్టి స్వాగతం పలికారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**ఇందుకూరుపేట :** గంగపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చాముండేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ ఆలయ ఆవరణలో మంగళవారం జరిగింది. ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు విశేషంగా తరలిరావాలని, అమ్మవారి కృపాకటాక్షం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఈఓ బండి శాంతయ్య, కైలాసం ఆదిశేషారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ కొండూరు కృష్ణారెడ్డి, నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

## నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

**కొడవలూరు :** గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ జి.జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎక్కడైనా మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణ చర్యలు తీసుకుని నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, పిల్లలు ఎండల బారిన పడకుండా చూడాలని చెప్పారు. గృహ లబ్ధిదారులకు పొదుపు ద్వారా అదనంగా రూ.35 వేలు మంజూరు చేస్తున్నందున సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి సొంతింటి కల సాకారం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ ఈనెల 24, 25, 30, 31 తేదీల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నందున ప్రతిఒక్కరూ వారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏపీఎం ఎస్.రుక్మిణి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పి.సురేష్‌కుమార్, ఎ.రమేష్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీడీఓ, ఎంపీపీ

## సబ్‌స్టేషన్‌లో ఎస్‌ఈ ఆకస్మిక తనిఖీ

**ఇందుకూరుపేట :** మండలంలోని నరసాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ నిర్వహణ, లోడింగ్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వేసవి నేపథ్యంలో సరఫరాకు ఎటువంటి ఆటకం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏడీ సునీల్‌కుమార్, ఏఈ నరసింహులు ఉన్నారు.



నరసాపురం సబ్‌స్టేషన్ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య

## ఖరీఫ్‌లో వరిసాగు లాభదాయకం

**కొడవలూరు :** ఖరీఫ్‌లో అనువైన వరి రకాలను సాగు చేయడం లాభదాయకమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతిదేవి సూచించారు. మండలంలోని దామేగుంట, తలమంచి గ్రామాల్లో ఖరీఫ్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఎన్ఎల్‌ఆర్ 3354, ఎన్ఎల్‌ఆర్ 34449, భరణి, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, ఎన్ఎల్‌ఆర్ 40024 రకాలు ఖరీఫ్‌లో అనువైన రకాలుగా నిర్ధారించినట్లు వెల్లడించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం విషయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు లక్ష్మి, మధురిమ, వీఏఏలు ఎస్.ప్రసాద్, బి.లిఖిత, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ మారుతిదేవి

# కాలనీలకు సిమెంటు రోడ్లు

**పొదలకూరు :** పట్టణంలోని ఎమ్మార్వో కాలనీ ఎస్టీల నివాసం వద్ద మంగళవారం సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నుడా నిధులు రూ.16 లక్షలు మంజూరు చేయించడంతో సిమెంటురోడ్డు పనులను సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పట్టణంలో మట్టిరోడ్డు లేకుండా మంత్రి కాకాణి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో సీసీరోడ్లు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే నిధులను విడుదల చేయించినట్లు చెప్పారు. పనులు వేగంగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు ఎస్‌కే అంజాద్, భాస్కర్, హరి, నేతలు ఎం.శేఖర్‌బాబు, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.శివశంకర్, డి.విజయభాస్కర్‌రెడ్డి, ఎస్.పరంధామిరెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్వో కాలనీలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు

**పునరావాస కాలనీకి..**

పొదలకూరు పంచాయతీ తెలుగుగంగ పునరావాస కేంద్రం (తోకంచి) కాలనీకి అంతర్గత సిమెంటురోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తోకంచి కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రెండు అంతర్గత సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలను నిర్మించాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించి నిధులు మంజూరు చేయించారు. దీంతో అంతర్గత సిమెంటురోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధిలైట్లను కూడా అమర్చారు. దీంతో మంత్రి కాకాణికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



తోకంచి కాలనీలో పూర్తయిన సిమెంటురోడ్డు